www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## పోరుమామిళ్ల లో ఆటో డ్రైవర్లకు పోలీసు శాఖ సూచనలు ఇచ్చిన సర్కిల్ ఇన్స్ పెక్టర్ హేమ సుందర్ రావు మరియు సబ్ ఇన్స్ పెక్టర్ హనుమంతు



**పోరుమామిళ్ల,జూన్15.అక్షర టైమ్స్:** కడపజిల్లా పోరుమామిళ్ల ఆటో డ్రైవర్ లకు పోలీసు శాఖ వారు ఇచ్చిన సూచన లో ప్రజలు లకు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియమాల అమలు దృష్ట్యా పోరుమామిళ్ళ మండలం లోని అన్ని ఆటో డ్రైవర్లు క్రింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసు శాఖ సూచిస్తున్నది. ఆటోలో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు.డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ మరియు ఫిట్‌నెస్ పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.మద్యం సేవించి లేదా మత్తు పదార్థాల ప్రభావంలో వాహనం నడపరాదు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ నిర్దేశిత వేగ పరిమితుల్లోనే వాహనం నడపాలి.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్లపై లేదా కూడళ్ల వద్ద ఆటోలను నిలిపివేయరాదు.పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి మరియు అధిక ఛార్జీలు వసూలు చేయరాదు.. ఆటోలో చట్టవిరుద్ధమైన వస్తువులు లేదా అనుమానాస్పద వ్యక్తులను తరలించరాదు. అలాంటి విషయాలు గమనించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి..వాహనంలో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా అధిక శబ్దంతో మ్యూజిక్ వ్యవస్థలను వినియోగించరాదు..ట్రాఫిక్ మరియు మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఆటో డ్రైవర్లు అందరూ పై సూచనలను పాటించి ప్రజల భద్రతకు సహకరించాలని రాజశ్రీ పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.హేమ సుందర రావు మరియు రాజశ్రీ పోరుమామిళ్ల సబ్ ఇన్స్పెక్టర్ పి. హనుమంతు కోరడమైనది.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

### కోట్ల విలువైన సహాయక పరికరాల పంపిణీ
### ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల,జూన్15.అక్షర టైమ్స్:-** సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు స్వయం సమృద్ధితో జీవించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డులో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ (ADIP) పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరితో కలిసి కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వృద్ధులకు చేతికర్రలు తదితర సహాయక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సుమారు 5 వేల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వివిధ సహాయక పరికరాల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు చేరవేసి వారికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు అంశంపై స్పందిస్తూ, 90 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి పూర్తిగా ఇతరులపై ఆధారపడే వ్యక్తులకు ప్రత్యేక నిబంధనల మేరకు అధిక పెన్షన్ అందజేస్తున్నట్లు వివరించారు. అర్హుల వివరాలను వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.16 కోట్ల నిధులు కేటాయించిందని, మరింత మంది లబ్ధిదారులకు మద్దతు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.



జిల్లాలో 24,679 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.15.26 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా డయాలసిస్ మరియు మంచానికే పరిమితమైన పక్షవాతం బాధితులకు ప్రత్యేకంగా రూ.1.53 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు సామాజిక భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగ శక్తి కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలి. జిల్లాలో ఇప్పటివరకు 1.42 లక్షల మంది దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకుని రూ.58.64 లక్షల విలువైన ప్రయాణ సౌకర్యం పొందినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డ్ కార్యాలయాల్లో మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని, సాధారణ వినతిపత్రాలు సమర్పించడం ద్వారా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, సంబంధిత విభాగాలు పరిశీలించిన అనంతరం తుది అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీంకో సంస్థ కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ కొనియాడారు. గత మూడు వారాలుగా సంస్థకు చెందిన సిబ్బంది జిల్లాలోనే ఉండి లబ్ధిదారుల అవసరాలకు



అనుగుణంగా పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలీంకో ద్వారా గుర్తించిన 1,847 మంది దివ్యాంగులకు దాదాపు రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్న ఆత్మవిశ్వాసం, పట్టుదల సమాజానికి ఆదర్శమని, వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం గుర్తించి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, స్థలాల కబ్జా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, ఉమ్మడి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాతిమా, ఆర్డిఓ విశ్వనాథ్ మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ రవికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు వారు నిర్వహించిన ప్రవేశ పరీక్ష లో పోరుమామిళ్ల విద్యార్థులు ఎంపిక






**పోరుమామిళ్ల,జూన్15.అక్షర టైమ్స్:-** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ముస్లిం మైనారిటీల కోసం తాలీం - ఏ - హునర్ అనే ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసి 10 వ తరగతిలో 450 మార్కులకు పై బడిన విద్యార్థులకు ఉచితంగా రెండు సంవత్సరాల పాటు ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ జెఇఇ / నీట్ కోచింగ్ ఇప్పించుటకు వక్ఫ్ బోర్డు నిర్ణయించింది.ఈ ప్రవేశ పరీక్ష నందు మొత్తం 6600 మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాయడం జరిగినది అందులో మొత్తం 250 మందిని సెలెక్ట్ చేశారు. వీరిలో కడప జిల్లాకు చెందిన వారు 28 మంది, వీరిలో పోరుమామిళ్ళకు చెందిన ఇద్దరు విద్యార్థులు సెలెక్ట్ కావడం గర్వకారణం వీరీలో ఒక విద్యార్థి వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి ఎస్.మాహిర్ అను విద్యార్థి మరొకరు వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి వా. సనా అను విద్యార్థిని సెలెక్ట్ అయ్యారు.ఈ ప్రవేశ పరీక్షలో సెలెక్ట్ అయిన విద్యార్థులను నారాయణ మరియు శ్రీ చైతన్య కళాశాలలో రెండు సంవత్సరాలు ఉచిత ఇంటర్మీడియట్ విద్యను ఇప్పించనున్నారు.దేశంలో వక్ఫ్ బోర్డు ప్రప్రథమంగా ఇలాంటి చర్యలు చేపట్టినందుకు ముస్లిం మైనారిటీలు చాలా సంతోషించారు. సెలెక్ట్ కాబడిన ఈ 250 మంది విద్యార్థులకు నిన్నటి రోజున 14.06.2026 వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు విద్యార్థులకు అలాట్మెంట్ లెటర్ ఇవ్వడం జరిగినది

## భారీ జన సందోహంతో విజయవత్సవ సభ విజయవంతం




### ప్రజల విశ్వాసమే ప్రభుత్వ బలం విజయవత్సవ సభలో నేతలు ప్రసంగం: మంత్రి నిమ్మల నాయుడు, జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**ఆదోని,జూన్15.అక్షర టైమ్స్:-** కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన విజయవంతంగా పూర్తి చేసుకొని మూడో సంవత్సరములోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా కర్నూల్ లో నిర్వహించిన విజయవత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల కాలంలో ప్రజా సంక్షేమం, కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో మరింత



ఉత్సాహంగా మూడో సంవత్సరంలో అడుగుపెడుతున్నామని తెలిపారు. అనంతరం గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన దిశగా ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబాటుతో ముందుకు సాగుతోందని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని, రానున్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో కర్నూలు జిల్లా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమం మొత్తం పార్టీ శ్రేణుల



ఉత్సాహం, క్రమశిక్షణ, ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయోత్సవ సభను విజయవంతం చేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలందరికీ గుడిసె ఆది కృష్ణమ్మ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యేల బొగ్గుల దస్తగిరి , పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరావు రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆదోని నియోజకవర్గం ఇన్చార్జ్ కే మీనాక్షి నాయుడు, ఆలూరు నియోజకవర్గం ఇన్చార్జ్ వైకుంఠ జ్యోతి, మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జ్ రాఘవేందర్ రెడ్డి, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## జ్యోతి క్షేత్రంలోని శ్రీ కాశిరెడ్డి నాయన స్వామి ఆలయాన్ని దర్శించుకున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి





**కడపజిల్లా కాశినాయన జూన్ 15( అక్షరటైమ్స్) :** బద్వేల్ నియోజకవర్గం, కాశినాయన మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ కాశిరెడ్డి నాయన స్వామి ఆలయాన్ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అలాగే జ్యోతి క్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయంగా నిలుస్తూ భక్తులకు విశేషమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కర్నాటి వెంకట రెడ్డి,చెరుకూరి రవి నాయుడు,కల్లూరు దుగ్గిరెడ్డి,పామూరి బాలి రెడ్డి,బి.జే.పి.నాయకులు బుసి రెడ్డి మనోహర్ రెడ్డి,బిజివేముల నారాయణ రెడ్డి,ఎదురు బాస్కర్ రెడ్డి,కర్రా ఈశ్వర రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 22 -A భూ సమస్యలకు చెక్ రైతులకు, ప్రజలకు ఊరట



### ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు పరిష్కారం పత్రాల పంపిణీ

**మదనపల్లి,జూన్15.అక్షర టైమ్స్:-** రైతులకు, ప్రజలకు పారదర్శక సేవలే లక్ష్యం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 22-ఏ భూ సమస్యలకు జిల్లా యంత్రాంగం వేగంగా పరిష్కారం చూపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా మదనపల్లి రాయచోటి, పీలేరు సబ్ డివిజన్ల పరిధిలో ఏళ్లుగా పరిష్కారం కాని 22-ఏ సంబంధిత 27మంది రైతులకు సంబంధించిన 27.31ఎకరాలు భూ సమస్యలను పరిష్కరించినట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. సోమవారం మదనపల్లి కలెక్టరేట్లో భూ సమస్యల



పరిష్కారానికి సంబంధించి పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయా డివిజన్ల పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత పాత రికార్డులు, దస్త్రాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.భూమి రికార్డులు సరిగ్గా ఉండటం రైతులకు అత్యంత కీలకమని, పంట రుణాలు, భూమి లావాదేవీలు మరియు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో వెబ్‌ల్యాండ్ రికార్డులు ముఖ్య పాత్ర పోషిస్తాయని జేసి వివరించారు. రికార్డుల్లో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే జిల్లా పరిపాలన ప్రధాన



లక్ష్యమన్నారు.మిగిలిన దరఖాస్తులను కూడా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని జేసి పేర్కొన్నారు. 22 A భూ సమస్యలు పరిష్కరించిన 27మంది రైతులకు, ప్రజలకు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మంజూరు పత్రాలను అందజేశారు. గత అనేక సంవత్సరాలుగా సర్వే నంబర్ సవరణలు, కొత్త సర్వే నంబర్ల చేర్పులు, అడంగల్ వివరాల సరిదిద్దడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఈ చర్యల ద్వారా ఊరట లభించింది. వివరాలు మదనపల్లి డివిజన్ - 5 మంది 9.56 ఎకరాలు. పీలేరు డివిజన్ 18 మంది 7.61 ఎకరాలు రాయచోటి డివిజన్ - 4 మంది. - 10.14 ఎకరాలు మొత్తం : 27 మంది 27.31 ఎకరాలు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలకు గుర్తింపు తేవాలి

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు
### రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్





**వేంపల్లె,జూన్15.అక్షర టైమ్స్:-** పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉర్దూ పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.6 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2 వేలు నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. వచ్చే ఏడాది కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని తెలిపారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను పదోతరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, రాహుల్, మహబూబ్ షరీఫ్, పాఠశాల కమిటీ చైర్మన్ షాజీరా, వైస్ చైర్మన్ కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసుల దృష్టి ముగ్గురికి శిక్ష విధించిన న్యాయస్థానం



**ఆదోని,జూన్15.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం ఇ స్వీ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరు పరచగా, గౌరవనీయులైన అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ నిందితులు వీరేష్, చంద్ర, ఆంజనేయులు విచారణ చేపట్టారు. విచారణలో నిందితులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కావడంతో ముగ్గురికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆదోని న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ కుమార్ మాట్లాడుతూ, మద్యం సేవించే వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతావని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించండి

### ఏపీయుడబ్లుజె ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి




**నంద్యాల,జూన్15.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లాలోని జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు ఏపీయుడబ్లుజె ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్లుజె రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, జిల్లా అధ్యక్షులు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ భాషాతో పాటు నంద్యాల పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, యూనియన్ నాయకులు ప్రదీప్, చల్ల మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉండే జర్నలిస్టులు తమ పిల్లల చదువులకై ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నా, కరోనా సమయం నుండి పాఠశాలల యాజమాన్యం సరిగా స్పందించడం లేదని కలెక్టర్ కు వివరించారు. ఇప్పటికైనా పలు జిల్లాలలో అమలవుతున్న 50% ఫీజు రాయితీని నంద్యాల జిల్లాలో కూడా అమలయేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఫీజు రాయితీ కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటానని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిడి న్యూస్ శేఖర్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పెచ్చులూడిన గోడల మధ్య బాలికల నివాసం.!




**నంద్యాల,జూన్15.అక్షర టైమ్స్:-** పాఠశాలలు ప్రారంభమై విద్యార్థులు హాస్టళ్లకు చేరుకుంటే వారికి సురక్షితమైన వసతి కల్పించాల్సిన బాధ్యత ఎవరిది.? భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు.? విద్యార్థినుల ప్రాణాల కంటే ప్రభుత్వానికి మరేదైనా ముఖ్యమా.? నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితులు చూస్తే ఇలాంటి ప్రశ్నలే ఉత్పన్నమవుతున్నాయి.గోడల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి.పై కప్పులు బలహీనంగా కనిపిస్తున్నాయి.గదుల్లో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.వర్షాకాలం ప్రారంభమైన వేళ శిథిల భవనంలో విద్యార్థినులను ఉంచడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొంటుందా.? లేక ఏదైనా విషాదం జరిగిన తర్వాతే చర్యలు చేపడుతుందా.? శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి,విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించాలని ప్రజలు,తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థినుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? హాస్టల్ భవనం బాగుచేసేందుకు నిధులు లేవా.? లేక విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా.? అంటూ విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు.

## విద్యా దోపిడీ మాఫియాను అరికట్టాలి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్




**ఆళ్లగడ్డ,జూన్15.అక్షర టైమ్స్:-** ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల కమిటీ సమావేశంకు ముఖ్య అతిధిగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు,కళాశాలలు ఫీజు నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి,ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి,పాఠశాల ఆవరణలో పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, ఇతర విద్యా సామగ్రి విక్రయాలను నిలిపివేయాలిని చట్టం ఉన్నా జిల్లా లోన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు చట్టానికి వ్యతిరేకంగా విద్యను వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లి తండ్రుల కష్టాలను కాసులుగా మారుస్తూ విద్యా వ్యాపార దోపిడీ మాఫియా చలామణి అవుతున్నా విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్టు వ్యాహరిస్తున్నారు, తక్షణమే విద్యా శాఖ అధికారులు నిద్ర మేలుకొని పేద, బడుగు, బలహీన వర్గ విద్యార్థులకు విద్యను అందెల చూడాలని లేని పక్షంలో ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక్ష ఆందోళనలు,ముట్టడిలు నిర్వహిస్తామని వారు అన్నారు.ఈ ఈకార్యక్రమంలో ాఖీ× ఆళ్లగడ్డ మండల కార్యదర్శి లతీఫ్ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్, హర్ష, రాజేష్, దస్తగిరి, మధు, హరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి: పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ




**నంద్యాల,జూన్15.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పిడిఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు.సోమవారం నంద్యాల పట్టణంలో ప్రజా ఫిర్యాదు పరిష్కారిక వేదికలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డికి పిడిఎస్యు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు లక్షలాది రూపాయల ఫీజుల రూపంలో వసూలు చేస్తూ పుస్తకాలు మరియు దుస్తులు అని ప్రత్యేక ఫీజుల రుసుములను వసూలు చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా స్పెషల్ ఫీజు స్కూల్ డే ,అన్యువల్ డే అంటూ డబ్బే ధ్యేయంగా పాఠశాలలు నడుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆర్టీఈ చట్టాన్ని నంద్యాల జిల్లా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పిడిఎస్యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు షాహీద్, నంద్యాల పట్టణ నాయకులు లక్ష్మీకాంత్ యుగంధర్ , సుధీర్, సుభాన్, నాయబ్,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాంబ్లింగ్ పై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఉక్కుపాదం



**సిద్ధవటం,జూన్15.అక్షర టైమ్స్:-** సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలో మాచుపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి. రూ.2,79,060/-ల నగదు, 52 పేక ముక్కలు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం, 8 మంది అరెస్టు 14.06.2026 న సిద్ధవటం మండలంలోని మాచుపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు సిద్ధవటం పోలీసు సిబ్బంది పేకాట ఆడుతున్న వారిపై మెరుపు దాడి నిర్వహించడం జరిగింది.ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.2,79,060/-ల నగదు, 52 పేక ముక్కలు మరియు రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. అదుపులోకి తీసుకున్న నిందితుల వివరాలు స్వర్ణ నాగేశ్వరరావు, తండ్రి సుబ్బరాయుడు, బిజి వేముల గ్రామం, కోయిలకుంట్ల మండలం, నంద్యాల జిల్లా. చింతకుంట రామమోహన నాయుడు, తండ్రి: శేషయ్య, మీనాపురం గ్రామం, ప్రొద్దుటూరు.గాలిపోతుల కృష్ణపాల్, తండ్రి కనకరాజు, స్వరాజ్ నగర్, ప్రొద్దుటూరు. పొన్నతోట రాజు, తండ్రి ఇశ్రాయిల్, ఆర్.ఎస్. కాలేజ్ ప్రాంతం, ప్రొద్దుటూరు. సుంకేసుల చిన్న సిద్దయ్య, తండ్రి: పీరయ్య, మూలవంక గ్రామం, సి.కె. దిన్నె మండలం. కల్లూరు గోపాలు, తండ్రి అంకయ్య, ఏ.సి. నగర్, నెల్లూరు జిల్లా. నెట్టెం వేణు, తండ్రి వెంకటయ్య, మైపాడు గేట్, శ్రీనివాస్ నగర్, నెల్లూరు. వజ్రా సుబ్బయ్య, తండ్రి సుబ్బన్న, టీచర్స్ కాలనీ, ప్రొద్దుటూరు. పరారీలో ఉన్న అమర్నాథ్ రెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా చట్ట వ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు నిరంతరం దాడులు నిర్వహిస్తూ ఉంటారని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ హెచ్చరించారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా ఉరుసు ఉత్సవాలు





**హన్మకొండ,జూన్15.అక్షర టైమ్స్:-** హన్మకొండలోని న్యూ బస్ స్టాండ్ వద్ద ఉన్న చారిత్రక దర్గా హజ్రత్ సయ్యద్ హీరే షా మియా హసనీ హుసైనీ బగ్దాదీ రహ్మతుల్లా అలైహి వారి రెండు రోజుల వార్షిక ఉర్స్ షరీఫ్ ఎంతో భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉర్స్ వేడుకలు 13 జూన్ శనివారం రోజు సందల్ షరీఫ్ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఇషా నమాజ్ అనంతరం సందల్ మహ్‌ఫిల్ తర్వాత మహ్‌ఫిల్-ఎ-ఖవ్వాలి నిర్వహించబడింది. ఇందులో ప్రముఖ ఖవ్వాలు మనాఖిబ్ మరియు సూఫీ గీతాలను ఆలపించి హాజరైన భక్తుల హృదయాలను ఆనందపరిచారు. 14 జూన్ శనివారం రోజు ఉర్స్ షరీఫ్ ప్రధాన దినోత్సవం జరిగింది. 13 మరియు 14 జూన్ రెండు రోజులూ లంగర్-ఎ-ఆమ్ విస్తృతంగా ఏర్పాటు చేయబడింది. హన్మకొండతో పాటు వరంగల్, పరకాల మరియు ఇతర పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు హాజరై దర్గా ఫైజ్ పొందారు. ఈ పవిత్ర కార్యక్రమానికి సజ్జాదా నషీన్ బార్గాహ్-ఎ-అఫ్జలియా కాజీపేట మరియు తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ హజ్రత్ అల్లామా మౌలానా సయ్యద్ షా గులాం అఫ్జల్ బియాబానీ అలియాస్ ఖుస్రో పాషా అధ్యక్షత వహించారు. ఉర్స్ సందర్భంగా ఫఖ్ర్-ఎ-దక్కన్ హజ్రత్ అల్లామా మౌలానా సయ్యద్ షా అజీజుల్లా ఖాద్రీ జల్సా ఫైజాన్-ఎ-ఔలియాపై ప్రత్యేక ప్రసంగం చేశారు. తన ప్రసంగంలో ఆయన హజ్రత్ హీరే షా మియ్యా? వారి ధార్మిక మరియు ఆధ్యాత్మిక సేవలను వివరించి, సూఫీ తత్వం, ప్రేమ మరియు సోదరభావం సందేశాన్ని వ్యాప్తి చేయాలని కోరారు. చివరగా దేశం మరియు జాతి శాంతి, భద్రత మరియు ఉమ్మత్-ఎ-ముస్లిమా క్షేమం కోసం ప్రత్యేక దువా చేయబడింది. దర్గా కమిటీ తరపున విచ్చేసిన జాయిరీన్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


## ఎస్సీ సంక్షేమ సంఘంలోకి భారీగా యువత చేరిక

### హక్కుల పోరాటానికి, మౌలిక వసతుల సాధనకు కదంతొక్కిన యువరక్తం



**మైదుకూరు,జూన్15.అక్షర టైమ్స్:-** ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు విలియమ్ కలమలమిట్ట మార్గదర్శకత్వం మరియు ఆదేశాల మేరకు, సోమవారం ఉదయం వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయినాథపురం కొత్తకొట్టలు గ్రామంలో ఉప్పలపాటి కుమార్ అధ్యక్షతన జరిగిన ఒక ప్రత్యేక సామాజిక ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘంలోనికి స్థానిక యువత భారీ సంఖ్యలో చేరారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందుగా సంఘ నాయకులు ఉప్పలపాటి కుమార్ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, విప్లవాత్మక నినాదాల మధ్య ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అక్కడ సభగా కూడిన భారీ యువజన సమూహాన్ని ఉద్దేశించి అత్యంత స్ఫూర్తిదాయకంగా ప్రసంగిస్తూ, ప్రస్తుత సమాజంలో దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు యువతరం పాత్ర ఎంతో అమూల్యమైనదని కొనియాడారు. యువరక్తం తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదని, అన్యాయాలపై గళమెత్తడంలో యువత ఎల్లప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొత్తకొట్టలు ప్రాంతంలో స్థానికులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్లకు పట్టాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అధ్వాన్నంగా మారిన రహదారుల పునర్నిర్మాణం, ఆధునిక డ్రైనేజీ కాలువల ఏర్పాటు, రాత్రి వేళల్లో అంధకారాన్ని దూరం చేసే వీధిదీపాలు వంటి అత్యవసర కనీస మౌలిక వసతుల కల్పన జరగాలంటే, ఈ క్లిష్ట పరిస్థితుల్లో యువత అంతా ఒకే తాటిపైకి వచ్చి సంఘటిత శక్తిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వాల నుంచి మనకు రావలసిన సంక్షేమ ఫలాలను, హక్కులను పోరాడి సాధించుకునేందుకు విలియమ్ కలమలమిట్ట నాయకత్వంలో ఎస్సీ సంక్షేమ సంఘం నిరంతరం అండగా ఉంటుందని, సంఘ ఆశయాలకు ఆకర్షితులై ఇంత పెద్ద ఎత్తున యువత ముందుకు రావడం శుభపరిణామమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగిన ఈ భారీ చేరికల కార్యక్రమంలో ముఖ్య నాయకులు షేక్ మహమ్మద్ జువేర్, జేస్దాది చిన్న ఓబులేష్, సిరవాటి జమ్మయ్య, పసల విజయ్ కుమార్, అన్నవరం విజయ్, గుడిమే మోస, గుడిమే సుధాకర్, తప్పెట వరుణ్ కుమార్, అన్నప్ప సాంబయ్య, పసల చిన్న పుల్లయ్య, పసల పెద్ద నాగేంద్ర, అన్నారపు అంజిలతో పాటు స్థానిక దళిత సంఘాల ప్రతినిధులు, కాలనీ పెద్దలు, మహిళలు, సంఘ కార్యకర్తలు మరియు వందలాది మంది యువతీ యువకులు పాల్గొని, కరతాళ ధ్వనుల మధ్య ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## ఆరనిదీ తీరొక్క పూలతడి



బతుకమ్మలో ఎన్ని రకాల పూవులు పేరుస్తామో అన్ని రకాల అనుభవాలు, ఆనందాలు ఆడవాళ్లకి. మారింది సమాజం, మారింది పరిస్థితులు అని లెక్కలు, కాగితాలు సర్వేలు ఏమేమో చెప్తారు కానీ చుట్టూ చూస్తే పరిస్థితి ఎప్పటిలాగానే ఉంది. అందుకే నేమో తెలంగాణలో బతుకమ్మ తల్లి వెలిసినట్టుగా గట్టిగా అనిపిస్తుంది నాకు. ఒక నలభై, యాభై ఏండ్ల కిందటి వరకు బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పోని ఆడవాళ్లు ఉండరు. పెళ్లిదాకా ఎటూ ఉంటారు. పెండ్లి తర్వాత నుంచి మొదలుపెడితే పిల్లలకు పది పన్నెండేండ్లు వచ్చేవరకన్న తల్లిగారింటికే పోవడం, సంతోషంగా పుట్టింట్లో దోస్తులతో ముచ్చట్లు, పిల్లలకి తినిపించడాలు, జడలు వేయడాలు, స్నానాలు, కొత్త బట్టలు%d% వీలుంటే కొనడాలు లేకుంటే అత్తగారింట్లో కొన్న వాటిని అందరికీ ఎంతో ఆనందంతో చూపడం.. అబ్బో ఒక్క పని కాదు. పిల్లల చదువు కొంచెం పెరుగుతున్న కొద్దీ ఆమె తన ఇల్లు, పిల్లల చదువులు మొదలైన వాటితో ఊపిరి తీయలేనంత బిజీ అయిపోతుంది. ఇంకా అనేక సాదకబాధకాలు కూడా తోడవుతయి. తల్లిగారింటికి వెళ్లడం తగ్గిపోతుంది. బతుకమ్మ తల్లిగారింట్లో ఐతే ఒకరకంగా అత్త గారింట్లో ఐతే ఇంకోరకంగా తప్పక ఉంటుంది అమ్మాయిలకి. ఎట్లా అంటారా? అత్తింటిలో ఎంత లేదన్న కొంచెం మనసు, ఒళ్ళు దగ్గరపెట్టుకొని చేసుడు, అమ్మ దగ్గర కొంచెం అటు ఇటు అయినా నడుస్తుంది. అమ్మ సర్దుకుపోతది. పైగా కొంచెం దోస్తులదగ్గరికి ఇంకా ఆ ఊళ్ళోనే చుట్టాలు ఉంటే పోయిరావడానికి అమ్మనే చొరవ తీసుకొని పో బిడ్డ పన్లు నేను చేసుకుంటా.. పిల్లల్ని కూడా చూసుకుంటా అంటది. బతుకమ్మ సాంప్రదాయం ప్రకారం కొందరు ఇప్పటికీ బొడ్డెమ్మ నుంచి బతుకమ్మలు మొత్తం జరుపుకునే వాళ్ళున్నారు. బతుకువేటలో తీరిక లేక కేవలం మొదటిది, చివరిది చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ తోనే సరిపెట్టేవాళ్లున్నారు. సద్దుల బతుకమ్మ రోజు మాత్రం పల్లె పట్నం అని కాక తెలంగాణా అంతటా ఒక వంద పండుగల వైభోగం, సందడి. ఆ సంబురమే వేరు. గునుగు, తంగేడు, చామంతి, బంతి, కలువ, గన్నేరు, గులాబీ, మల్లెలు ఇట్ల దాదాపు ఎన్ని రకాల పూలు మనకి అందుబాటులో ఉంటాయో అన్నిటిని పేరుస్తూ ఆ మధ్యలో ఖాళీ అంతా గునుగు తంగేడు తరుగుతో నింపుతూ గట్టిగా ఇంకో కంచంతో ఒత్తుతూ చక్కటి అందమైన బతుకమ్మని పేర్చి దేవుడి గది దగ్గరే ఒక పీట వేసి పెడతారు. ఆ తర్వాత ఇంకో తోడు బతుకమ్మని పేరుస్తారు. పూజ చేసేటప్పుడు పసుపుతో గౌరమ్మను చేసి తమలపాకుల్లో చిన్న బతుకమ్మని పళ్లెంలో సర్దిపెడతారు. బతుకమ్మలకి పెట్టే అగరొత్తుల వాసన ఆ రోజంతా అందరి ఇళ్లల్లో ఒక అలౌకిక భావన తెప్పించి తీరుతుంది. సాయంత్రం కలిగిన తీరుగా కొత్తవి.. లేకుంటే పెళ్లి నాటివి పట్టుచీరలు పెళ్లి అయినవాళు ్ళ, పిల్లలు ఉన్నవాటిలో కొత్తవి కట్టుకుంటారు. ఉంటే బంగారు నగలు కూడా తప్పక వేసుకొని ఎవరింటిముందు వాళ్లు అలికి ముగ్గేసి రెండు బతుకమ్మలని పెట్టి ఒకటి రెండు చిన్న పాటలతో లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ ఆడిన తర్వాత దగ్గరలో ఉన్న గుడి లేదా కూడలి లాంటి చోట చీకటి పడేదాక ఆడతారు.